క్లుప్తంగా

ఉపసర్పంచ్ రాజీనామా



నాదెండ్ల: జంగాలపల్లె గ్రామ ఉపసర్పంచ్ గాదె స్లీవారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ నెల 15వ తేదీన ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్‌ను రాజీనామా లేఖ అందజేయగా, ఆయన పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి విజయ భాస్కర్‌రెడ్డికి సమాచారం అందించారు. సోమవారం స్లీవారెడ్డి రాజీనామాను ఆమోదిస్తూ డీపీవో కార్యాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయానికి సమాచారం అందింది. తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. అయితే 2021 ఫిబ్రవరిలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గ్రామ పెద్దలు వైసీపీలోని ఇరు వర్గాల మధ్య రాజీ చేశారు. ఒప్పందం మేరకే రాజీనామా చేసినట్లు సమాచారం. అయితే స్లీవారెడ్డి ఉపసర్పంచ్‌గా కాకుండా పంచాయతీ బోర్డు మెంబర్‌గా కొనసాగుతారు.

నిరంకుశ బీజేపీ పాలనపై పోరాడాలి



చిలకలూరిపేట: కేంద్రంలోని నిరంకుశ బీజేపీ పాలన అంతం కోసం కలిసికట్టుగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ, సీపీఎం పట్టణ కార్యదర్శులు పేలూరి రామారావు, పేరుబోయిన వెంకటేశ్వర్లు చెప్పారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రజా వ్యతిరేక,మతోన్మాద బీజేపీని సాగనంపుదాం- దేశాన్ని కాపాడుదాం అన్న నినాదం ప్రచారభేరి కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కరపత్రాలు పంచుతూ, ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారభేరి కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు అనేక మంది త్యాగధనులు బ్రిటీష్ వలస పాలకులను తరిమికొట్టి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారని వివరించారు. నేడు అదే స్ఫూర్తితో బీజేపీ నియంతృత్వ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీల నాయకులు నాయుడు శివకుమార్, భగత్‌సింగ్, సాతులూరి బాబు, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం

వినుకొండ(నూజెండ్ల) : పట్టణంలోని అంకాలమ్మపేట నివాసి అనుముల శంకరరావు అనారోగ్యంతో మృతిచెందడంతో అంత్యక్రియలు నిమిత్తం వారి కుటుంబసభ్యులకు వినుకొండ నియోజకవర్గ పద్మశాలీయ సంఘం ద్వారా రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని ఓబయ్యకాలనీ నివాసి బి. కోటేశ్వరరావు అనారోగ్యంతో మృతిచెందడంతో అంత్యక్రియల నిమిత్తం వారి కుటుంబసభ్యులకు సంఘం తరపున రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో అవ్వారు కోటేశ్వరరావు, చిలివేరు ఏడుకొండలు, వై.బ్రహ్మం, పంచుమర్తి శ్రీధర్ బాబు, వెంకటసురేష్‌బాబు, కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

21న సర్వసభ్య సమావేశం

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో టి.పార్వతి తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ప్రగతి వివరాలు, మండలంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చ ఉంటుందని చెప్పారు.

పౌష్టికాహారం పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): పవిత్ర రంజాన్ మాస పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక కమ్యూనిటీ హెల్త్ కేర్ సెంటర్ నందు చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్ స్కీం ప్రాజెక్టు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కంటి పరీక్ష విభాగ సహాయ అధికారి షేక్ చాంద్‌బాషా (సీహెచ్‌సీ) ఆర్థిక సహకారంతో పౌష్టికాహారం పంపిణీ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఎన్. బుచ్చిబాబు మాట్లాడుతూ వేసవికాలంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఏఆర్టీ మందులను సక్రమంగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీటీసీ ఇన్‌చార్జి డాక్టర్ రజాక్, కౌన్సిలర్ కె.సురేష్, ఎల్‌టీ సీహెచ్ రోజా, పీపీ యూనిట్ సిబ్బంది ఎస్ సౌమ్య, టి.రత్నకుమారి, సంస్థ సిబ్బంది, జోనల్ సూపర్‌వైజర్ బి.నాగేశ్వరరావు, క్లస్టర్ లింకు వర్కర్ వై. ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో పురపాలక చలివేంద్రాలు

చలివేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు. పురపాలక సంఘం కార్యాలయం నందు చలివేంద్రం ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వినుకొండ పట్టణంలో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కరించామని, గత టీడీపీ ప్రభుత్వం మాదిరి తాగునీటి కోసం బిందెలతో కొట్లాడుకునే దుస్థితి పోయిందని అన్నారు. పట్టణ ప్రాంతాలకు వచ్చే వారు, ప్రయాణికులు చలివేంద్రాలను సద్వినియోగించుకోవాలని కోరారు. మినరల్ వాటర్ కాకుండా మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు, లోకేశ్‌లు ఎన్ని పాదయాత్రలు చేసినా అధికారంలోకి రాలేరని, ప్రజలు వైఎస్సార్ సీపీ పక్షాన ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో సంక్షేమం, అభివృద్ధి పేరుతో ఒక వినుకొండకే రూ.2 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏ ఒక్క మంచి పనినైనా చేయలేకపోయారని విమర్శించారు. తమ హయాంలో వెటర్నరీ, అగ్రికల్చర్, ముస్లిం మైనార్టీ కళాశాల, ఎస్టీ గురుకుల పాఠశాలతో పాటు అనేక కళాశాలలు వినుకొండకు తీసుకొచ్చామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బి. శ్రీనివాసులు, వార్డు కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, పాపసాని బ్రహ్మయ్య, సానాల పుల్లయ్య, ఎంఎస్‌కే బాషా, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, ఎంపీపీలు పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి, మేడం జయరామిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ దండు చెన్నయ్య, సొసైటీ చైర్మన్ అనుమోలు నాసరరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, రొడ్డా పుల్లారెడ్డి పాల్గొన్నారు.

రేపు నరసరావుపేటలో ఇఫ్తార్

- హాజరుకానున్న సినీ నటుడు ఆలీ
- జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్సీలు రాక
- ప్రతి ఒక్క ముస్లిం సోదరుడు హాజరుకావాలని కోరిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, మైనార్టీ నాయకులు

నరసరావుపేట: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తి శ్రద్ధలతో ఉపవాసం ఉంటూ ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మైనార్టీ సోదరులకు ఈనెల 19వ తేదీ బుధవారం సాయంత్రం పట్టణంలోని షాదీఖానాలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇదే తన ఆహ్వానంగా భావిస్తూ నియోజకవర్గంలోని ముస్లిం సోదరులు అందరూ పార్టీలకు అతీతంగా హాజరుకావాలని ఆయన కోరారు. సోమవారం ప్రకాష్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మైనార్టీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర చలనచిత్ర కమిటీ అధ్యక్షుడు, సినీనటులు ఆలీతో పాటు జిల్లా కలెక్టర్ శివశంకర్, జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జాయింట్ కలెక్టరు శ్యామ్‌ప్రసాదు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి హాజరవుతున్నారన్నారు. అదే రోజున సుమారు రూ.25 లక్షల వ్యయంతో ఎయిర్ కండీషన్‌తో ఆధునీకరించిన షాదీఖానాను పునఃప్రారంభించుకోవటం ప్రారంభించుకోవటం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, నియోజకవర్గ, పట్టణ మైనార్టీసెల్ అధ్యక్షులు షేక్ ఖాదర్‌బాషా, షేక్ మహబూబు బాష, పాదిలే ఖాజా, సయ్యద్ ఖాదర్‌బాష, సయ్యద్ ఖాజ పాల్గొన్నారు.

విజ్ఞతతో అగ్నిప్రమాదాలను ఎదుర్కోవాలి



అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడే విధానాన్ని ప్రదర్శిస్తున్న సిబ్బంది



అగ్ని ప్రమాద జాగ్రత్తలపై మాక్ డ్రిల్‌లో పాల్గొన్న ఫైర్ సిబ్బంది, విద్యార్థులు

చిలకలూరిపేట: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఆందోళనకు గురికాకుండా విజ్ఞతతో వ్యవహరించాలని ఇన్‌చార్జి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎస్.భాస్కరబాబు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని చౌదరయ్య స్కూల్‌లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు అగ్ని మాపక పరికరాలు ఉపయోగించే విధానం వివరించారు. అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడే విధానాన్ని డెమో ద్వారా ప్రదర్శించి చూపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎస్.వెంకయ్య, కె.శివ నాగేశ్వరరావు, పీవీ సుబ్బారావు, కేఎస్ రామకృష్ణ, స్కూల్ ప్రిన్సిపాల్ మెహబూబ్ బాష పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్

నరసరావుపేట ఈస్ట్: జాతీయ అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా సోమవారం అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ-ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో అగ్ని ప్రమాదాలు- నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులతో అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాద సమయంలో ఎత్తైన భవనం నుంచి బాధితులను రక్షించటం, మంటలలో కాలిన గాయాలు, పొగకు ఊపిరాడని పరిస్థితులలో తీసుకోవలసిన ప్రథమ చికిత్స తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఫైర్ ఆఫీసర్ ఎం.వి.సుబ్బారావు ఆధ్వర్యంలో లీడింగ్ ఫైర్‌మెన్ జమ్ముల శ్రీనివాసరావు, ఫైర్‌మెన్స్ వి.వి.ఎస్ ప్రసాద్, పుష్పరాజ్, డ్రైవర్ ఆపరేటర్ బి.కిరణ్‌లు విద్యార్థులతో మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు, వైస్‌ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంజాన్ సుఖ సంతోషాలతో నిర్వహించుకోవాలి

- కలెక్టరేట్ మసీదులో ప్రార్థనలు
- ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రంజాన్ మాసం పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న మసీదులో సోమవారం సాయంత్రం నిర్వహించిన నమాజ్, ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన రంజాన్ మాసం అంతా నియమనిష్టాలు, కఠోరమైన ఉపవాసాలు, దైవ ప్రార్థనలతో గడిపి, పేదవారికి సాయం చేస్తూ భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటున్న ముస్లిం సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సేవా తత్పరితనం, పవిత్రతలకు ప్రతీకగా నిల్చే రంజాన్ పర్వదినం జరుపుకొని సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, లింగంగుంట్ల మాజీ ఉపసర్పంచు పొన్నపాటి విజయకృష్ణారెడ్డి, మసీదు పెద్దలు, లింగంగుంట్ల గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

రొంపిచర్ల: స్థానిక అగ్రికల్చర్ మార్కెట్ యార్డులో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని వార్డ్ చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు సోమవారం తెలిపారు. క్వింటాళ్లకు రూ.1962ల ధర చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ క్రాప్ చేయించుకున్న రైతులు వారివారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో వారి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని మొక్కజొన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మజ్జిగ, మంచినీటి చలివేంద్రం ప్రారంభం



చలివేంద్ర ప్రారంభం కార్యక్రమంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి, పొడా చైర్మన్ మిట్టపల్లి తదితరులు

నరసరావుపేట: వేసవిని దృష్టిలో పెట్టుకొని పట్టణంలోని శివుడి బొమ్మ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం ప్రారంభించారు. తొలుత అమరజీవి పొట్టి శ్రీరాములు, దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పులిహోర పంపిణీ చేశారు. దాతలైన మురళిపెయింట్స్ నిర్వాహకులను అభినందించారు. పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, సంఘ అధ్యక్షులు కొత్తూరి కోటేశ్వరరావు, వీఎస్పీ సాంబశివరావు, బత్తుల విష్ణు తదితర వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అధిగమించాలి

శావల్యాపురం: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను నూరు శాతం సాధించటానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తమవంతు బాధ్యత వహించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల యాప్ నమోదుపై అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామసచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 0-5 సంవత్సరాల లోపు చిన్నారుల ఆధారు చేర్పులు మార్పులు త్వరతిగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ పి.సుగుణ, ఎంఈవో సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై దృష్టి



హైవే రోడ్డుపై బ్లాక్‌స్పాట్‌లను పరిశీలిస్తున్న డీఎస్పీ విజయ భాస్కరరావు సీఐలు రాజేశ్వరరావు, అచ్చయ్య

యడ్లపాడు: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలపై దృష్టి సారించారు. ఒకవైపు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తిస్తూ..ఇకపై ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గానికి విచ్చేసిన నరసరావుపేట డీఎస్పీ విజయభాస్కర్ స్థానిక పోలీసు అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. వారితో కలిసి నియోజవర్గం పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాద ప్రాంతాలు (బ్లాక్‌స్పాట్ ఏరియా)ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చిలకలూరిపేట మండలం బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి టెంపుల్ వద్ద, అలాగే పట్టణంలోని అడ్డరోడ్డు, విజయబ్యాంక్, ఎన్ఆర్‌టీ సెంటర్, ఆర్‌టీసీ బస్టాండ్, గణపవరం మెయిన్‌సెంటర్, గణపవరం-తిమ్మాపురం మధ్య ప్రసూనవంశీ కృష్ణ నూలు మిల్లు, తిమ్మాపురం జంక్షన్, వంకాయలపాడు వద్ద ప్రమాద ప్రాంతాలుగా గుర్తించామన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వాహనాలు జోరు తగ్గించేందుకు వేగనిరోధాలుగా సైన్‌బోర్డులు, పెయింటింగ్, స్టిక్కరింగ్ చేసిన డ్రమ్ములు, పాత టైర్లు గతంలోనే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అక్కడ మరికొన్ని మార్పులు చేసేలా అధికారులకు కొన్ని సూచనలు అందించామన్నారు. ప్రస్తుతం ఆయా బ్లాక్‌స్పాట్లలో ప్రమాదాల సంఖ్య బాగా తగ్గిందన్నారు. హైవే అధికారులను సమన్వయం చేసుకుని బ్లాక్‌స్పాట్లకు కొద్దిదూరంలోనే ప్రత్యేకంగా కనిపించే ప్రమాద హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో అర్బన్, రూరల్ సీఐలు రాజేశ్వరరావు, అచ్చయ్య, ఎస్ఐలు పైడి రాంబాబు, భాస్కరరావు, రాజేష్ తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం



యడ్లపాడులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

యడ్లపాడు: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం యడ్లపాడు గ్రామంలో కొనసాగింది. కార్యక్రమంలో గృహసారథి మండల కన్వీనర్ రాచమంటి చింతారావు, పార్టీ నాయకులు పూరంగి నాగమల్లేశ్వరరావు, కర్నాట సుబ్బారావు, మారెళ్ల శివాంజనేయులు, సాయిబాలాజీ పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి జగనన్న స్టిక్లర్లు అతికించారు. నవరత్న పథకాల గురించి కుటుంబ యజమానులకు వివరించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ మరో మారు మేలు చేసే నాయకుడు జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో గృహసారథులు పాల్గొన్నారు.

వేసవిలో పాఠ్యాంశాలలపై ఆసక్తి పెంచుకోవాలి



తొమ్మిదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న రామిరెడ్డి

నాదెండ్ల: తొమ్మిదో తరగతి విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం పదో తరగతి కీలకం కానుందని గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. హెచ్ఎం ఎం సుందరరావుతో కలసి 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. ఉన్నత పాఠశాల ఏర్పడి 15 సంవత్సరాలు అయిందని, అప్పటి నుంచి ప్రతి ఏడాది పదో తరగతి విద్యార్థులు పోటీ పడుతూ మంచి ఫలితాలు సాధించారని గుర్తు చేశారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు మన గ్రామంలోనే ఏపీ మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్, వృత్తి విద్యాకోర్సులు చదివే అవకాశం ఉందన్నారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థుల నుంచి పాఠ్య పుస్తకాలు సేకరించి ముందుగానే సబ్జెక్టులపై అవగాహన పెంచుకోవాలన్నారు. అవసరమైతే అందుబాటులో ఉన్న ఉపాధ్యాయుల ద్వారా పట్టు సాధించేలా శిక్షణ తీసుకోవాలన్నారు.